# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

JANUARY - 1999

# సంక్షిప్త వార్తలు

1998 నవంబరు నెల సువార్తికుల సదస్సు పశ్చిమగోదావరి జిల్లా, జొన్నలగరువు గ్రామములో 27వ తేదీ శుక్రవారమున జరిగెను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలనుండి వచ్చిన అనేకమంది సువార్తికుల సమక్షములో ఆనాడు, "రక్షింపబడుటకు విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునా ? విధేయత కూడా అవసరమా ?" అను అంశము చర్చింపబడెను. అక్టోబరు నెలలో భారీ వర్షాల కారణంగా ఉభయ గోదావరి జిల్లాల సువార్తికుల సదస్సు జరుగనందున అనేకమంది సువార్తికులు సంతోషంతో జొన్నలగరువు చేరుకొనిరి.

సదస్సుకు సోదరులు పి.జె. కృపాలినీ గారు అధ్యక్షత వహించగా, ఆర్. సామ్యూల్, కె.ప్రసాద్ గార్లు పాటలు నడిపించిరి. సోదరులు సి.హెచ్. జాన్‌బాబు గారి ప్రార్థనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు వి.చిన్నయ్య (కడలి), బి.ప్రసాదరావ్ (భీమవరం), జి.షద్రక్ (పాలకొల్లు), పి.హెచ్. వెంకటరావ్ (తాడిపూడి), యు.పాల్ (రాజమండ్రి), సి.హెచ్. జాన్‌బాబ్ (ముంగండ), గొల్ల రాజారావ్ (భీమవరం), ఆర్.బెవర్లీ (భీమవరం) మరియు జాషువా గూటం గార్లు పై అంశమును బైబిలును ఆధారంగా చేసికొని చర్చించిరి.

రక్షింపబడుటకు విశ్వాసము అవసరము. "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6). రక్షింప గోరువాడు దేవుని యందు, యేసుక్రీస్తునందు, పరిశుద్ధాత్మునియందు విశ్వాసముంచాలి. యేసు దేవుని కుమారుడని విశ్వసించాలి. విశ్వాసము ప్రాథమిక ఆజ్ఞ. విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలుననునది అబద్ధబోధ.

నమ్ముట మంచిదే, దయ్యములును నమ్మి వణకుచున్నవి (యాకోబు 2:12). "అలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే ఒంటిగా ఉండి మృతమైనదగును" (యాకోబు 2:17). విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలదని లేఖనములు తెలియజేస్తున్నాయి. "మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రము గాక క్రియల మూలమునను నీతిమంతుడని యెంచబడునని మీరు దీనివలన గ్రహించితిరి" (యాకోబు 2:24). ఫిలిప్పీయులో చెరసాల అధిపతి "అయ్యలారా రక్షణ పొందుటకు నేనేమి చేయవలెనని" పౌలు, సీలాలను ప్రశ్నించెను. వారు విశ్వాసముంచుమని సమాధానమిచ్చి అతనికిని అతని యింటి వారికిని వాక్యమును బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడును అతని యింటి వారందరును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:30-34). ఒకడు రక్షింపబడవలెనంటే క్రీస్తు సువార్తను విని (రోమా 10:17), విశ్వసించి (యోహాను 8:24), మారుమనస్సు పొంది (లూకా 13:3), పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని (అపొ.కా. 2:38) లేఖనములు బోధించుచున్నవి.

జొన్నలగరువులో సువార్త పని చేయుచున్న సోదరులు యం.ఎల్. క్రిష్టాఫర్ గారు, వారి కుటుంబము, స్థానిక సంఘము సదస్సు నిమిత్తమై చక్కని ఏర్పాట్లు చేసి వచ్చిన వారికి

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 | జనవరి 1999 | సంచిక 6


## సంపాదకీయం

### క్రీస్తు రాకకొరకు దేవుడు లోకమును సిద్ధపరచిన విధానము
### ( How God Prepared the World for the Coming of Christ )

**పరిచయము :** యేసు ఈ లోకమునకు అప్పుడు ఎందుకు వచ్చెను ? దేవుడాయనను మన కాలంలో ఎందుకు పంపలేదు ? లేదా అంతకుముందు ఎందుకు పంపలేదు? అనే ప్రశ్నలు తరచు మనకు రావచ్చును. ఆయనను మనము అనుకున్న కాలంలో దేవుడు ఎందుకు పంపలేదో మనకు తెలియదు గాని, "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి- ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (గలతీ 4:4). అందు వలన దేవుడు తన కుమారుడైన క్రీస్తును ఆయన దివ్యజ్ఞానమును బట్టి సరియైన సమయములోనే ఈ లోకమునకు పంపెనని గ్రాహ్యమగుచున్నది. ఆయన కాలము పరిపూర్ణమైనప్పుడు వచ్చెను. అంటే దేవుడాయనను పరిపూర్ణ సమయంలో

పంపబడడమే కాకుండా, ముందుగా నిర్ణయింపబడిన సంకల్పము చొప్పున, ఆయనను పంపుటకు వివిధ ఏర్పాట్లు సిద్ధమైనప్పుడు ఆయన పంప బడెనని గ్రాహ్యమగుచున్నది. గనుక క్రీస్తును పంపుటకు దేవుడు ఈ లోకమును సిద్ధపరచిన విధానమును ఈ పాఠములో మనం తెలిసికొనబోవుచున్నాము. దేవుడు చేసిన ఈ సిద్ధపాటును గూర్చి యిదివరలో మీరు కొంత నేర్చుకొనియేయున్నారు.

## ఆయన సంకల్పము పునర్విమర్శ (Review of His Plannig)

బాప్తిస్మమిచ్చు యోహాను "అరణ్యములో కేకవేయువాని శబ్దము. "అతడు ప్రభువు మార్గమును సిద్ధపరచుటకును, ఆయన త్రోవలు సరాళము చేయుటకును పంపబడెను (యెషయా 40:3-9; మలాకీ 3:1; మత్తయి 3:3; మార్కు 1:3; లూకా 3:4; యోహాను 1:23). చరిత్రాత్మకముగా తిబెరికైసరు యొక్క ఏలుబడిలో పదునైదవ సంవత్సరమందు అతని పని ఆరంభమాయెను (లూకా 3:1). పాత నిబంధన కాలములో బల్యర్పణ పద్ధతి అంతా, క్రీస్తు యొక్క రాకకొరకు దేవుడు చేసిన ఏర్పాటే. ఈ అంశమును విపులముగా వచ్చే సంచికలో మనం ధ్యానించుదము.

క్రొత్తనిబంధనలో నెరవేర్చబడిన ప్రవచనములనేకములున్నాయి. అవి నెరవేర్చబడుట అట్లుంచి, అవి ముందుగనే ప్రవచింపబడెనను సంగతి నీవు గుర్తుంచుకోవాలి. దీనిని బట్టి దేవుడు క్రీస్తు రాకను గూర్చి ముందుగా ఆలోచించి, సంకల్పించెనని మనకు గ్రాహ్యమగుచున్నది.

- ఆయన కన్యకు జన్మించునని దేవుడు సంకల్పించెను (యెషయా 7:14).
- ఆయన బేత్లెహేము పురమందు జన్మించునని దేవుడు సంకల్పించెను (మీకా 5:2).
- ఆయన జననమును దేవదూతలు ప్రచుర పరచునని దేవుడు సంకల్పించెను (లూకా 1:26-35).
- ఆయన యూదా జనాంగమునుండి అనగా అబ్రాహాము సంతతినుండి

ఉద్భవించునని దేవుడు సంకల్పించెను (ఆది 12:3; 18:18).

- ఆయన యొక్క వంశావళి విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము వరకు, చివరకు ఆదాము వరకు సుళువుగా తెలియబడునట్లు దేవుడు సంకల్పించెను (మత్తయి 1:1-17; లూకా 3:23-28).
- ఆయన ప్రపంచ పరిస్థితి అల్లకల్లోలములో యున్నప్పుడు వచ్చునని సంకల్పించబడెను (దానియేలు 9:25).
- ఇంకా దానియేలు 2:1-44 లో నెబుకద్నెజరు కనిన కలలను బట్టి దేవుని ఏర్పాటు యొక్క ఋజువు మనకు మరింత తెలియనగును.

క్రీస్తు యొక్క రాకకొరకు వీటిని, ఇట్టి అనేకమైన ఋజువులను బైబిలునుండి పొందుపరచుచు, దేవుడు చేసిన ఏర్పాట్లు ఎట్టివో మనం గ్రహించుకొనడమే గాక, వీటిని దృఢపరచుచు ఆనాటి లోకము యొక్క రాజకీయ, సాంఘిక, ఆర్థిక, ఆత్మీయ పరిస్థితులను గూడ గమనించుదము. అవియు కూడ క్రీస్తు రాకకొరకు దేవుడు ముందుగా చేసిన ఏర్పాట్లను నిర్ధారించుచున్నవి.

గమనిక : క్రీస్తుకు 400 సంవత్సరముల ముందు పాతనిబంధన ముగించబడెను. ఆ తరువాత దేవుడు మాట్లాడకుండెను. అయితే లోకము క్రీస్తు బయల్పాటును గూర్చి వేచియుండగా లోకములో పలు సంగతులు సంభవించుచుండెను. గనుక మన సమాచారము బైబిలునుండి గాక, నమ్మదగిన యితర స్థావరములనుండి సేకరించబడినది.

## క్రీస్తురాకకొరకు దైవిక ఏర్పాట్లు

ఈ అంశమును పరిశోధించుటలో మన ముఖ్య ఉద్దేశ్యము ఏమంటే- కాలము పరిపూర్ణమైనప్పుడు, అన్ని ఏర్పాట్లు సంసిద్ధముగా యున్నప్పుడు క్రీస్తు వచ్చియుంటే దానివలన కలుగు ప్రయోజనం యేమిటి ? అది సర్వలోకమునకు సువార్తను ప్రకటించుటయే దీనిని సాధించుటకు తోడ్పడిన పరిస్థితులేమిటి? దిగువ వాటిని గమనించుము :

**హెబ్రీ జాతి ఎంచుకొనబడి సంరక్షింపబడుట :** పాతనిబంధనను మనము చదివినట్లయిన హెబ్రీ జాతి ఇకలేకుండ సర్వనాశనమయ్యే సందర్భములు అనేకములు మనకు కనబడును. దేవుడు కలుగజేసికొనకపోతే వారు తప్పక నాశనమై యుండేవారు. లోక రక్షకుడైన యేసుక్రీస్తు ఈ జాతిలో ఉద్భవింప వలసి యుండెను గనుక దేవుడు వారి విషయమై ప్రత్యేక శ్రద్ధగలిగి వారిని భద్రముగా యుంచెను :

**ఐగుప్తు బానిసత్వములోనుండి వారిని విమోచించెను:** దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వమునుండి విడిపించి, ఆదేశమునుండి బయటికి తీసికొనిరాకపోతే వారెన్నడు గొప్ప జనాంగమై యుండకపోదురు. పరిగదా క్షీణత జెందిన బానిస జనాంగముగా తయారైయుందురు. అయితే వారు తప్పక సర్వనాశమవుదురనుకొనే సరికి దేవుడు ఎర్ర సముద్రమును రెండుపాయలుగా చీల్చి, వారిని సురక్షిత ప్రదేశమునకు తరలించెను.

**కానామదేశమును పట్టుకొనుటలో దేవుడు వారికి సహాయం చేసెను:** దేవుని సహాయం లేకపోతే ఇశ్రాయేలీయులు తమలో తాము విభజింపబడి, కానానులో యున్న వివిధ అన్య ప్రజలలో కలసిపోయి యుందురు.

**కానానును తమ ఆధిపత్యములో యుంచుకొనుటకు దేవుడు సహాయం చేసెను:** వారు కానాను దేశమును జయకరముగా పట్టుకొనినను, వారి చుట్టుయున్న ప్రజల ఆచారములకు త్వరలో లోబడిపోయే గుణము గలవారు. దేవుని సహాయం లేకపోతే హెబ్రీయులు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదము పొంచియుండెను. వారు పలుమార్లు దేవునికి అవిధేయులైరి; పలుమార్లు శిక్షింపబడిరి. చివరకు బబులోనుకు బానిసలుగా కొనపోబడిరి.

**బబులోను నుండి దేవుడే వారిని విడిపించెను :** వారి శత్రువుల చెరసాల లలో 70 సంవత్సరముల గడిపిన తరువాత, వారు సర్వనాశసము కాకుండ

దేవుడు వారి యెడల జోక్యము చేసికొనెను. వారిని విడుదల చేయించెను. అయినను వారిలో కొద్ది శేషము మాత్రమే యెరూషలేముకు తిరిగి వెళ్లిరి. పెక్కుమంది ఈలోక మందంతటా చెదరిపోయిరి.

యూదులకు దేవుడు నేరుగా సమాయం చేసిన ఇట్టి సందర్భములెన్నో యున్నవి. అవి సందర్భ రహితములు కానేకావు. అయితే దేవుని సహాయం లేకపోతే క్రీస్తు యొక్క మూల పురుషులు ఎవరు ఉండకపోవుదురు.

**అలెగ్జాండరు చక్రవర్తి యొక్క విజయములు :** గ్రీకు సామ్రాజ్యాధిపతియైన అలెగ్జాండరు చక్రవర్తి క్రీ॥పూ॥ 334-326లో సాధించిన విజయములను బట్టి ప్రపంచము నేలెను. అతడు గ్రీకు భాషను, గ్రీకు సంస్కృతిని ప్రపంచవ్యాప్తి చేసెను, మానవుడెరిగిన భాషలలో గ్రీకు అతి సున్నితమైన, ఖరాఖండితమైన (Precise) భాష. అది ఆధ్యాత్మిక తలంపులను అతి సూక్ష్మముగా, కచ్చితముగా వ్యక్తపరచగల భాషయై యుండెను. మానవుని యెడల దేవుడు తన చిత్తాన్ని లోకమునకంతకు తెలియజేయుటకు దీనికంటే శ్రేష్టమైన భాష ఇంకేమి యున్నది ?

**క్రీ॥పూ॥ 285లో హెబ్రీ బైబిలు గ్రీకులోనికి తర్జుమా చేయబడుట :** టొలెమి ఫిలడెల్ఫస్ (Ptolemy Philadelphus) అనునతని పాలనలో 70 మంది విద్యావేత్తలు హెబ్రీ బైబిలును గ్రీకు భాషలోనికి అనువదించిరి. వారు దానిని ఈజిప్టు దేవములో అలెగ్జాండ్రియా పట్టణములో అనువదించిరి. హెబ్రీ భాషకు బదులు ప్రపంచ మంతటా గ్రీకు భాష వ్యాప్తి జెందుచున్నదని గ్రహించి యూదులు బైబిలును గ్రీకులోనికి తర్జుమా చేసిరి. తత్ఫలితముగా యూదులు కాని లక్షలాది ప్రజలు కూడా దేవుని వాక్యము నెరిగే అవకాశమును కల్పించిరి. అంతేకాదు అప్పటి వరకు బహుదేవతార్చన చేయు అన్యజనాంగములలో పెక్కుమంది ఏకైక దేవుని నారాధింప మొదలిడిరి.

**యూదులు పరిశుద్ధ లేఖనములతో విశ్వ వ్యాప్తముగా చెదరిపోవుట :** క్రీస్తు పూర్వము 5వ శతాబ్దములో యూదులు బబులోను చెరనుండి విడిపింపబడి

నప్పుడు, వారిలో అనేకమంది ప్రపంచ నలుమూలలా చెదరిపోయిరి. వారు తమతో వారి లేఖనములను కూడా మోసుకొని పోయి ఆరాధనా స్థలములను నెలకొల్పిరి. క్రీస్తు కాలములోనే యూదులు ఏయే దేశములకు చెదరిపోయి యుండిరో తెలిసికొనుటకు అపొ.కార్యములు 2:9-11 వరకు చదువుము. అక్కడ కనీసము 15 జనాంగములనుండి వచ్చిన భక్తిగల యూదులను నీవు గమనించవచ్చును.

**యూదుల మధ్య విగ్రహారాధన మాయమై పోవుట :** యూదులు బబులోను చెరనుండి విడుదల పొందిన తరువాత, తమలోనున్న విగ్రహములను విసర్జించిరి. క్రీస్తుకాలము నాటికి యూదులలో విగ్రహములేమీ లేకుండెను. తమ చుట్టుయున్న గొప్ప జనాంగములు విగ్రహారాధనలో మునిగియుండగా, యూదులు ఒక్కరు మాత్రమే ఏకైక దేవుని ఆరాధనకు కట్టుబడియుండిరి. అందువలన దేవునినుండి ఉన్నతమైన ఆధ్యాత్మిక బోధననంగీకరించుటకు మిగతా జనాంగములకంటే వారు చక్కగా సిద్ధపడి యుండిరి. క్రీస్తును మొదట వెంబడించిన వారు యూదులే. అంతేగాకుండా ఆత్మీయముగా బలపడి, పెరిగియున్న అట్టి ప్రజల మధ్య క్రీస్తు సంఘము స్థాపించబడెను. వారు దానికి శ్రేష్ఠమైన నాయకత్వాన్ని అందించుటయే గాక సంఘాభివృద్ధికి దోహదపడిరి.

**అన్యదేవుండ్ల యెడల విశ్వాసము క్షీణించుట :** బహు దేవతార్చనలో మునిగి యున్న యూదులు కాని అన్యజనులు తమ సంస్కృతిలో జీవన సమస్యలకు జవాబును కనుగొన లేకపోయారు. అనేక జాతుల వారు, మతముల వారు, కలిసి మెలిసి యుండుట వలన అన్యదేవుండ్లు, దేవతలలో ప్రజలకు గల విశ్వాసము మరింత క్షీణించింది. ఈ రీతిగా ఏర్పడిన ఖాళీని క్రీస్తు యొక్క మార్గము భర్తీ చేయుట మొదలిడింది. ప్రజలు క్రీస్తులో గొప్ప నిరీక్షణను, తమ జీవన సమస్యలకు జవాబును కనుగొనుట వలన యిది సంభవించినది.

**సమాజ మందిరముల అభివృద్ధి :** వయస్సు వచ్చిన పదిమంది యూదులైన పురుషులు కూడుకొనుట జరిగితే అది సమాజ మందిరమయ్యేది. బబులోను

చెరనుండి విడుదల పొందిన తరువాత యూదుల ఆరాధన స్థలములైన సమాజ మందిరములు విరివిగా అభివృద్ధి జెందినవి. ఆనాడున్న సమాజమందిరముల లోనికి తరుచు అపొ.పౌలును. మిగిలిన అపొస్తలులును వెళ్లి లక్షలాది ప్రజలకు క్రీస్తును గూర్చి బోధించుచుండిరి. లేఖనములను పరిశోధించుటకును, పఠించు టకును సహజ స్థావరములుగా సమాజ మందిరములు ఉపయోగపడుచుండేవి.

తూర్పునుండి గొప్ప పాలకుడుద్భవించునను నిరీక్షణ ప్రజలలో ప్రబలమై యుండెను: మత్తయి 2:1-10 చదువుము. యూదులు తమతో కూడ తీసికొని వెళ్లిన లేఖనములలో రాబోవు రక్షకుని గూర్చి, రాజును గూర్చి అనేక ప్రవచనము లున్నాయి. ఈ ప్రవచనములతో యూదులు లోకమంతా చెదరిపోయిరి. తత్ఫలితముగా లోకమంతయు ఉద్భవింపబోవు ఈ గొప్ప రాజును గూర్చి ఎదురు చూచుట జరిగెను. అందువలన క్రీస్తుయొక్క రాకడను గూర్చి అనేక జాతులవారు ముందుగనే ఎరిగి యుండుట ఆశ్చర్యము కాదు.

రోమా సామ్రాజ్యము ప్రబలి యుండుట : రోమా చక్రవర్తుల కాలములో నెలకొల్పబడిన రాజకీయ స్థిరత్వము, శాంతియుత జీవనము వలన వ్యాపారము గొప్పగా అభివృద్ధి జెందెను. అంతేగాకుండా రోమా వ్యాపారవేత్తలు ప్రపంచ వ్యాప్తముగా ప్రయాణించుట మొదలిడిరి. రోమా సామ్రాజ్య చట్టములు, ఉన్నత రోడ్డు రవాణా సౌకర్యములు, వారి నాగరికత అంతా అనుకూలములాయెను. రోమా దేశ చట్టమును బట్టి సంరక్షితులైన ప్రజలు సువార్తను అన్నిచోట్లా వ్యాప్తి చేసిరి. అల్లకల్లోలముగా యున్న ప్రపంచము ఒక క్రొత్త బోధ వ్యాప్తికి అనుకూలము కాలేదు గదా.

చిరకాలము నిలిచిన రోమా సామ్రాజ్యము : రోమా సామ్రాజ్యము క్రైస్తవ్యాన్ని తన రక్తనాళములలోనికి పూర్తిగా జీర్ణింప జేసుకొనడమే గాక, దానిపై దండెత్తిన అనేక కిరాతకుల మూకలకు సయితము దానిని అందించగలిగెను. ఈ విధముగా

క్రైస్తవ్యమును శతాబ్దముల తరబడి హింసించిన రోమా దేశము చివరకు దాని వ్యాప్తి కొరకే ఒక సాధనముగా తయారయ్యేను.

గమనిక: క్రైస్తవ్యము దేవుని వలన కలిగినదనుటకున్న ఒక గొప్ప ఋజువుయేమంటే, యితర మతముల వలె గాక, దానికున్న లిఖిత పూర్వకమైన చరిత్రయే. క్రీస్తు రాకముందే ఆయనను గూర్చి పాతనిబంధనలో విపులముగా వ్రాయబడెను. క్రీస్తు రాకముందు శతాబ్దముల తరబడి ఆయన రాక కొరకు ఈ లోకము సిద్ధపరచ బడెను; ఏర్పాట్లు చేయబడెను. ఆయన వచ్చినప్పుడు తరము వెంబడి తరము చొప్పున ఆదాము వరకు ఆయన వంశావళి నిర్ధారించబడగలిగెను. ఆయన ప్రత్యక్షత అకస్మాత్తుగా, మర్మ యుక్తముగా, అనుకొనని విధముగా సంభవించ లేదు. గాని ప్రతి చిన్న అంశము మట్టుకు సున్నితముగా దేవుని సంకల్పము చొప్పున ఏర్పాటు చేయబడెను.

## బాగుగా వినేవారు మనకు అవుసరము
## (We Need Better Listeners )

ప్రేక్షకలు సరిగా వినకపోవుట వలన చాల గొప్ప ప్రసంగములు ఫలించవు. బోధకుడు చాలా విజయవంతమైన రక్షణ సమాచారాన్ని ఇవ్వగలడు కాని దానికి ప్రేక్షక సమూహము శ్రద్ధచూపుట అవుసరం. అందుచేతనే యేసు లూకా 8:18లో ఈ విధముగా చెప్పుచున్నాడు. "మీరేలాగు వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి". ఆలాగుననే ప్రకటన గ్రంధములో చాలాసార్లు "చెవిగలవాడు వినును గాక!" అని ప్రభువు చెప్పెను. పరలోక సంబంధమైన రాజ్యవిస్తరణకు 'సరిగా విననివారు తప్ప మరియేదియు ఆటంకము కాదు.

జీవితములో ఏ విషయమునైనను సాధించాలి అంటే సరిగా వినుట అనేది ఒక కళగా అభివృద్ధి పరచుకొనవలెను. తేటగా వివరించబడిన విషయములపై శ్రద్ధచూపని అనేకమందిని గూర్చి బైబిలులో అనేక ఉదాహరణలు కలవు. సరిగా వినకపోవుట చేత కొంతమంది పాపము చేసారు. అందుచే వారు సత్యమును

అన్వయించుకొనుటలో తప్పినవారైరి. సరిగా వినుటలో సోమరితనము గలవారు తీర్పుదినమును తప్పించుకొనలేరు. కనుక సరిగా వినక పోవుట అనునది చాలా గంభీరమైన విషయము. సరిగా వినకపోవుటను గూర్చి బైబిలులో ఈయబడిన ఉదాహరణలు పరిశీలింతము.

1) అపొ.కా. 13:26-27 పౌలు పిసిదియాలోని అంతియొకయలోని యూదులతో సమాజమందిరములో మాట్లాడుతూ సబ్బాతు దినమున సమాజము గా కూడుపుడెల్లా మెస్సీయా వస్తాడు అని సంవత్సరాల తరబడి ప్రవక్తల ద్వారా విన్నారు. లేఖనముల నెరవేర్పు ప్రకారము ఆయన వచ్చినప్పటికి, ఆయనను అంగీకించుటకు బదులుగా ఆ రక్షకుని చావునకు అప్పగించిరి. యాకోబు 1:22లో ఈ విధంగా వ్రాయబడి యున్నది. "మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చు కొనకుండా వాక్య ప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి". కనుక ఎంత జాగ్రత్తగా వినాలి!

2) సంఖ్యా 4:15లో పరిశుద్ధమైన దానిని దేనిని ముట్టవద్దు అని ప్రజలతో చెప్పినప్పటికి వారు దానిని సరిగా అర్ధము చేసికొనలేదు. అంత తేటగా నిదానముగా చెప్పినప్పటికి, ఉజ్జా ఆ మాటలయందు శ్రద్ధచూపక పోవుట వలన అతడు చావునకు అప్పగింపబడ్డాడు (2సమూ 6). ఈరోజులలో కూడా చాలామంది "నేను అలా అనుకొనలేదు" లేదా "నేను మరిచిపోయాను" అనే మాటల చాటున దాగు కొంటున్నారు. ఇవన్నియు మనకు బుద్ధి కలుగుటకు వ్రాయబడి యున్నవి (రోమా 15:4; 1కొరింథీ 10:11).

3. యోహాను సువార్తలో ఆయన తన స్వకీయుల యొద్దకే వచ్చెను గాని వారు ఆయనను నిరాకరించిరని వ్రాయబడియున్నది. ఆజీవపు వెలుగును వారు నిరాకరించిరి ఈ విధముగా మెస్సీయా రాకడను గూర్చిన ప్రవచనాలను వారు అంగీకరించలేదు. "మెస్సీయ వచ్చునపుడు ఈయనకంటే ఎక్కువైన సూచక

క్రియలను చేయునా అని చెప్పుకొనిరి". 2పేతురు 3:5లో వారు బుద్ధి పూర్వకముగా మరతురు అని వ్రాయబడియున్నది. ఇది వినుట లేక వినకపోవుటకు ఒక మంచి ఉదాహరణ.

4) అపొస్తలులు కార్యములు వినుటలో గల శ్రద్ధా విధానమును గూర్చి తెలియజేయుచున్నది. అ.కా. 2:41లో వాక్యమును అంగీకరించిన వారిని గూర్చి మనము నేర్చుకొన్నాము. అపొ.కా. 13:46లో అదే వాక్యోపదేశమును విన్నప్పటికి వారు దానిని త్రోసిపుచ్చి నిత్యజీవాన్కి అపాత్రులుగా చేసికొన్నారు. పెంతెకొస్తు దినమున వాక్యమును విన్నవారు వారి హృదయములలో నొచ్చుకొని మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందారు. అపొ.కా. 7వ అధ్యాయము లో స్తెఫను మాటలు విన్నవారు కోపముతో అతనిని చంపిరి. సరిగా వినని వారు మంచి బోధకులనుండి దూరమైపోతారు. కనుక మీరు ఏలాగు వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి. లౌకిక సంబంధమైన ఆలోచనలు, ఆశలు మనము కలిగియున్నట్లయిన అవి మన మనస్సులను చెవులను వినకుండా ఆటంకపెడుతూ ఆత్మీయ మార్గమును పాడుచేయును.

కనుక మనము ప్రతీ సమావేశములో ప్రతీ బైబిలు తరగతిలో జాగ్రత్తగా వినుటకు ప్రయత్నము చేయుదము. అపుడు మన ఆత్మలు సమతుల్యంగా ఉంటాయి. యిర్మియా 36లో యెహోయాకీము తాను విన్నదానికి ఏ విధంగా ప్రతిస్పందించాడో గమనించండి. సంఖ్యా.కాండము 20లో మోషే, 1సమూ 15లో సౌలు రాజు దేవుని ఆజ్ఞలను సరిగా వినలేదు. ఆలాగే పిలాతు కూడా తప్పుడు మూకల మాట వినుట వలన అనేక క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చెను. సరిగా వినుట అనునది ఒక కళ. అది నిత్యజీవానికి నడిపించును.

- జాపీ రామ్సే.

(11)

# మరణము తప్పించుట
## (Escape from Death)

మరణము అనగా ఎడబాటు లేక విడిపోవుట. మానవుడు శరీరము మరియు ఆత్మల కలయిక (ఆది.2:7). మరణము నందు శరీరము, ఆత్మ వేరగును (ప్రసంగి 12:7). బైబిలునందు రెండు విధములగు మరణములను కనుగొందుము. అవి

1. శారీరక మరణము : శరీరము నుండి ఆత్మ వేరగుట.
2. ఆత్మీయ మరణము : ఆత్మ దేవుని నుండి వేరగుట.

## మరణమునకు కారణము, దాని ప్రారంభము

ఆదియందు ఆదాము, హవ్వలు దేవునితో సంపూర్ణ సహవాసము కలిగి యుండునట్లు దివ్యోద్యానవనము నందుంచబడిరి. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు తినకూడదని వారు దేవునిచే ఆజ్ఞాపింపబడిరి (ఆది (2:17). వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదరని కూడా వారు హెచ్చరించబడిరి. అయినను వారు దేవుని మాటను వినుటకు బదులు అపవాది మాట విని తినకూడదని ఆజ్ఞాపించిన చెట్టు ఫలములు తినిరి (ఆది 3:6). ఆ విధముగా ఆజ్ఞను అతిక్రమించుటచే పాపము ఈ లోకములోనికి ప్రవేశించెను (1యోహాను 3:4; రోమా 5:12). ఆ పాపము యొక్క ఫలితమే మరణము (రోమా 6:23).వారి అతిక్రమమును బట్టి వారు దేవునితో గల ఆ మధుర సహవాసమును కోల్పోయి దివ్యోద్యానవనమునుండి వెళ్లగొట్టబడిరి. అదే ఆత్మీయ మరణము. దాని ఫలిత మేమనగా కష్టములు, నష్టములు, పాపపు కార్యములు మరియు నేడు మానవుడు ఎదుర్కొనుచున్న అనేక సమస్యలు ఉత్పన్నమాయెను. మరియు శారీరక మరణము కూడా దాని ఫలితముగానే లోకములోనికి ప్రవేశించెను. బైబిలునందలి మొదటి శారీరక మరణమును హేబేలు నందు గమనించగలము. విచారమేమంటే కయీను అర్పణను దేవుడు లక్ష్యపెట్టనందున అతడు హేబేలుపై అసూయతో దౌర్జన్యము

చేయుట వలన సంభవించెను. (ఆది 4:8). తరువాతి సహజ శారీరక మరణమును ఆదాము నందు చూడగలము. అతడు తొమ్మిది వందల ముప్పది ఏండ్లు జీవించి వృద్ధుడై మరణించెను (ఆది 5:5).ఈ లోకమునందలి ప్రతి మానవుడు శారీరక మరణమొందుట కు కారణం ఆది మానవులైన ఆదాము, హవ్వలు దేవుని ఆజ్ఞను అతిక్రమించి చేసిన పాపము యొక్క ఫలితమే. అందువలననే మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను (హెబ్రీ 9:27). అట్టి మరణమును ఎవరును తప్పించుకొనలేరు. ఎందుకనగా అది భౌతికమైనది. మానవుడు చనిపోయి నప్పుడు అతని భౌతికకాయము (శరీరము) మంటికి చేరును (ప్రసంగి 12:7). గనుక అట్టి మరణమునకు భయపడవలసిన పనిలేదు (మత్త 10:28). గానీ మనము మిక్కిలి భయపడవలసిన మరణము మరొకటి కలదు. అదే ఆత్మీయ మరణము.

## ఆత్మీయ మరణము

మానవునిలో దేవునిచే సృజింపబడిన ఆత్మకలదు (ఆది (2:7). దేవుడు మన ఆత్మలకు తండ్రి (హెబ్రీ 12:9). భౌతిక మరణమునందు మానవుని ఆత్మ దేహమును విడిచి దానిని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును. దేవుడు పరలోకమందున్నాడు (దాని 2:28), ఆయన పరిశుద్ధుడు (జెకర్యా 12:1). గనుక ఆత్మకు మరణము లేదు. గానీ పాపియైన మానవుని ఆత్మ నరకములో వేయబడి నిత్యము వేదన పొందును; మరణము యొక్క మూలార్ధము 'వేరగుట'. భౌతిక మరణమునందు శరీరమును విడచిన ఆత్మ దేవుని నుండి దూరమగుటయే ఆత్మీయ మరణము.

జన్మతః మానవుడు పాపికాదు. ఏలయనగా దేవుడు నరులను యధార్ధ వంతులనుగా పుట్టించెను (ప్రసంగి 7:29). గాని మానవుడు మంచి చెడ్డల విచక్షణ జ్ఞానము కలిగిన వయసు వచ్చినప్పుడు చెడును చేయుట ద్వారా పాపము అతనిలో ప్రవేశించును. ఆ పాపము యొక్క ఫలితమే మరణము (రోమా 6:23). పాపము

లేనివాడెవడునూ ఈ లోకములో లేడు. అందుకే అందరూ పాపము చేసిరని (రోమా 3:23) బైబిలు బోధించుచున్నది. పాపముతోనే మరణించినచో ఎవడునూ ఆత్మీయ మరణమును తప్పించుకొనలేడు. పాపియైన మానవుడు దేవుని యొద్ద నిలువలేడు (కీర్త 1:5). అట్టివారికి వేరొక స్థలము నిర్ణయించబడినది. అది పాతాళమందలి కటిక చీకటి బిలము (2పేతురు 2:4). అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు నుండును (మత్త 22:13). తీర్పు జరుగువరకు వారు ఆ స్థలములో యుందురు, ఆతరువాత వారు నరకములో వేయబడుదురు. అది అతి భయంకర మైన స్థలము వేదనకరమైన స్థలము (లూకా 16:24). అందు అగ్ని ఆరదు, అందుకే అది నిత్యాగ్ని అనబడెను (మార్కు 9:48; మత్త 25:41). నరుని ఆత్మ యెహోవా పెట్టిన దీపము (సామె 20:27) దీపముండగనే ఇల్లు చక్కబెట్టుకొనవలెనన్న చందమున మానవుడు భౌతికముగా మరణించక ముందే తన ఆత్మీయ మరణము నుండి తప్పించుకొనవలెను.

## మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము

మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము (కీర్త 68:20). జగత్తునందు పాపము ప్రవేశింపగానే పాపి విడుదలకు దేవుడొక సంకల్పమును (ప్రణాళికను) ఏర్పరచెను. పాపము నుండి విమోచించుటకు దేవుడిచ్చిన మొదటి వాగ్దానము స్త్రీ సంతానము (ఆది 3:15). పాపము చేసిననూ దేవుడు తన సృష్టి యెడల తన ప్రేమను చూపుచున్నాడు. ఎట్లనగా పాపము వలన తననుండి దూరమైన మానవుని తిరిగి తన సన్నిధికి చేర్చుకొనుటకు ఆయన ఒక మార్గము నేర్పరచెను. ఆ మార్గమంతయు దేవుని కరుణ, కృప, ప్రేమలపై ఆధారపడియున్నది (యోహాను 3:16, ఎఫెసీ 3:8,9). ఆ మార్గము - రక్షణ మార్గము (అపొ.కా. 16:17), జీవమార్గము (మత్త 7:13,14), సమాధాన మార్గము (2పేతురు 2:2). అని పిలువబడినది. మరియు మానవాళిని దేవుని యొద్దకు నడిపించే ఆ మార్గము యేసుక్రీస్తు (యోహా 14:6, 1:51). ఆయన ఈ లోకమునకు రాకముందే ప్రజలను

పాపములనుండి రక్షించుటకు వచ్చుచున్నట్లు ప్రకటింపబడెను (మత్త 1:21). కాలము పరిపూర్ణమైనప్పుడు (గలతీ 4:4), ఆయన స్త్రీయందు (పురుషువి మూలముగా గాక పరిశుద్ధాత్మ శక్తి ద్వారా) పుట్టి (గల 4:5) మరణమునుండి తప్పించి జీవమిచ్చుటకే నేను వచ్చితినని చెప్పెను (యోహా 6:47-58). సర్వ మానవాళి పాపముల నిమిత్తము ఆయన రక్తము చిందించెను (మత్త 26:28). ఆరక్తము పాపముల నుండి విమోచించి మరణమును తప్పించును (1యోహా 1:7). మనము మన పాపముల చేతను, అపరాధముల చేతను చచ్చిన వారమై యుండగా (ఎఫెసీ 2:1). ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన కుమారుని ఈ లోకమునకు పంపించెను (1యోహా 4:9).

## రక్షణ సంకల్పము

పాపమువలన దేవుని నుండి తొలగి పోయిన మానవుడు తిరిగి దేవునితో సత్సంబంధమును కలిగియుండునట్లు దేవుడేర్పచిన రక్షణ సంకల్పమును తన పరిశుద్ధ గ్రంథమందు బయలు పరచెను మానవులందరు మరణము నుండి తప్పించుకొని నిత్యజీవము పొందుటకు ఆయన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను (ఎఫెసీ 1:3-7). ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను అతిక్రమించి దేవునికి శాశ్వతముగా దూరమైపోయారు. గానీ మనమైతే తిరిగి దేవుని యొద్దకు చేరుటకు ప్రేమామయుడైన దేవుడు మనలను ఆహ్వానించుచున్నాడు. మహా భయంకరమైన నరకము నుండి తప్పించుకొని మరణములో నుండి జీవములోనికి దాటుటకు (యోహా 5:24) పరలోకమందున్న తండ్రి చిత్తప్రకారము (మత్త 7:21) ఆయన కుమారుని మాట విని (మత్త 17:5) రక్షణ కలుగజేయుటకు శక్తి గల ఆయన సువార్తయందు (రోమా 1:16, 10:17) విశ్వాసముంచి (హెబ్రీ 11:6) నీ పాపములు తుడిచి వేయబడు నిమిత్తము మారుమనస్సు పొంది (అపొ.కా. 3:20) దేవునియందు నిలిచి యుండునట్లు యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని (1యోహా 4:15, రోమా 10:9,10) బాప్తిస్మము ద్వారా దేవుని రాజ్యములోనికి

ప్రవేశించుము (యోహా 3:3-6). అప్పుడు మరణము నిన్ను భయపెట్టదు.

ప్రియ స్నేహితుడా! సోదరీ! నీవు భౌతిక మరణము పొందిన తరువాత నీ పరిస్థితి ఏమిటి ? నీ నిత్యత్వమును ఎక్కడ గడపబోతున్నావు ? పరలోకం లోనా? లేక నరకములోనా ? నరకం అతి భయంకరమైనది సుమా !

- గౌరై ప్రసాద్
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

## పాపమును వారసత్వముగ పొందుదుమా ?
## (Do We inherit Sin today ? )

బిడ్డలు ఈ లోకములో జన్మించునప్పుడు పాపముతో పుట్టుదురని నమ్మేవారు ఈనాడు అనేకులున్నారు. ఆదాము హవ్వలు చేసిన ఆదిమ పాపముతోనే పిల్లలు జన్మిస్తారని వీరి బోధ. ఈ బోధవలన పిల్లలను "ఆదిమ పాపమునుండి" రక్షించే విధానమును మానవులు కొనుగొనుట జరిగినది! అయితే ఇదంతయు బైబిలు బోధకు వ్యతిరేకమైనది. చిన్నపిల్లల పాపమును పోగొట్టుటకు గాను వారిపై నీళ్లు చిలకరించడం, ఒక్కోసారి ముంచడం కూడ జరిగిస్తూ దాన్ని బాప్తిస్మమంటారు. ఈలాగ పసిపిల్లకు బాప్తిస్మమియ్యకపోతే వారు నశించిపోతారని వారు బోధిస్తారు. అయితే లేఖనములు దీనినేమీ సమర్ధించుటలేదు.

### పాపము యొక్క ఆరంభము

మానవుల అపరాధ ఆరంభమును గూర్చి ఆదికాండము నుండి తెలిసి కొందము. ఆదాము హవ్వలను పాపము లేకుండా దేవుడు సృజించెను. వారు ఏదెను వనములో యుంచబడిరి. కావలసినదంతయు, చివరకు జీవవృక్ష ఫలము లను కూడ దేవుడు వారికి అనుగ్రహించెను. ఆ వనములో యున్న సమస్తమును వారు తినవచ్చును గాని మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును మాత్రము

వారు తినకూడదని ఆజ్ఞాపింపబడిరి. వారా చెట్టు యొక్క ఫలమును తిను దినమున నిశ్చయముగా చచ్చెదరని దేవుడు వారిని హెచ్చరించెను. అయితే అపవాది సర్పము రూపమున వచ్చి హవ్వను శోధించి వారు చావనే చావరని చెప్పి మోసగించెను. అంతేగాకుండా వారు మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతల వలె యుందురని దేవునికి తెలియునని చెప్పి ప్రోత్సహించెను. హవ్వ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములను తిని, తనతో పాటు తన భర్తకును యిచ్చెను. అతడు కూడ తినెను. ఈ ఒక్క విషయములో వారు దేవునికి విధేయులై యుండాలో, అవిధేయులై యుండాలో అను నిశ్చయతను దేవుడు వారికిచ్చెను. అవిధేయులవుటకు వారు నిశ్చయించుకొనిరి. మంచి చెడుగులకు వారి కండ్లు ఇప్పుడు తెరువబడెను. వారి అంతరాత్మలు ఇప్పుడు మంచి చెడుగుల విచక్షణను గుర్తించెను. తత్ఫలితముగా వారు భయపడిరి, దేవునికి కనబడకుండా దాగుకొనుటకు ప్రయత్నించిరి. వారి దిగంబరత్వమును గూర్చి సిగ్గు నెరిగిన వారై ఆకులతో తమ్మును కప్పుకొనిరి.

## పాపము యొక్క పర్యవసానము

ఆదాము హవ్వల అవిధేయతను బట్టి దేవుడు మానవజాతికి శిక్ష విధించెను. మానవులు ఇప్పుడు మంచి చెడుగులను గుర్తించు అంతరాత్మ కలిగియున్నారు! అనేక సంగతులలో మంచి చెడ్డల నెంచుకొనే బాధ్యత ఇప్పుడు మానవునికున్నది. చెడుగును, దుష్టత్వమును ఎంచుకొనినందున అనుభవింపవలసిన పర్యవసానములు కూడ వానికున్నవి. ఇప్పటి వరకు హవ్వ గర్భము ధరించలేదు. గాని ఇప్పటినుండి ఆమె పిల్లలను కనును, మహావేదనతో ప్రసవించును. ఆదాము కూడా ఏదెనులో సమస్త సుఖములు అనుభవించుచుండెను. గాని ఇప్పటి నుండి కష్టపడి చెమటోడ్చి పనిచేయువలెను. తన కుటుంబమును పోషించవలెను. చివరిగా వారు జీవవృక్ష ఫలములు తిని చిరకాలము జీవించకుండునట్లు ఏదెను నుండి త్రోలివేయబడిరి.

## వారసత్వము వలన కాదు

ఆదాము హవ్వల పిల్లలు గాని, తదనంతరము జన్మించే పిల్లలు గాని ఆదాము హవ్వల పాపమునకు వారసులని లేఖనములు ఎక్కడను బోధించుట లేదు. ఆదాము హవ్వల పాపము యొక్క పర్యవసానము మాత్రము మానవజాతిని పీడించును. ఏలయనగా వారికండ్లు ఇప్పుడు తెరువబడియున్నని, మంచి చెడుగుల విచక్షణ ఇప్పుడు వారికున్నది మరియు జీవ వృక్ష ఫలములు వారికి అందుబాటులో లేకుండా పోయినవి.

కీర్తనలు 51:5ను బట్టి దావీదు పాపములో జన్మించినట్లు చెబుతున్నట్లు కొందరు భావిస్తారు. "నేను పాపములో పుట్టినవాడను. పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను" అని అతడు చెప్పాడు. దావీదు యొక్క తల్లి అందరి వలెనే పాపియైయుండెను. పాపిగా యున్నప్పుడు ఆమె నన్ను గర్భమున ధరించెను అని అతని యొక్క అసలైన భావము. ఎవడైనా పాపముతోనే జన్మించినట్లు చెప్పే ఆధారము దేవుని గ్రంధములో ఎక్కడా లేదు.

దావీదు యొక్క కుమారుడు మరణించగా నేనతని యొద్దకు పోదును గాని, అతడు నాయొద్దకు రాడు అని దావీదు చెప్పిన మాటలను నీ వెరిగే యుందువు. నా కుమారుడు పాపిగా చనిపోయి నరకానికి పోయాడని అతడు చెప్పుటలేదు. సరిగదా నాకుమారుడు ప్రభువు దగ్గరకు వెళ్లాడు, నేనును ఒకానొక దినమందు అక్కడకు చేరుకొందునని అతడు భావించాడు.

ఎల్లవేళలా సత్యమైన ఒక సూత్రమును యెహెజ్కేలు వ్రాసాడు : "పాపము చేయువాడే మరణము నొందును, తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు; నీతిపరుని నీతి ఆ నీతి పరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). ఇంకో మాటలో ప్రతివాడు వాని పాపమునకు బాధ్యుడు. అంటే ఆదాము

పాపము వలన గాని, మరింకొకని పాపమువలన గాని అపరాధియై ఎవడును ఈ లోకములో జన్మించుట లేదు. సరిగదా పుట్టిన ప్రతి శిశువు పవిత్రముగా, పాప రహితముగా పుట్టి, మంచి చెడుగుల విచక్షణ వయసు వచ్చువరకు ఆ స్థితిలోనే యుండును. అప్పుడు అతడు పాపము నెంచుకొని, దాన్ని జరిగించితే పాపి యగును.

అయితే రోమా 3:23లో అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని పౌలు చెప్పలేదా ? అది నిజమే. గాని నీవు దాని సందర్భమును గమనించితే అతడు అబద్ధములాడు వారిని గూర్చి, రక్తము చిందించు వారిని గూర్చి చెబుతున్నట్లు గ్రహించగలవు. అట్టివాటిని గూర్చి అపరాధులైన వారెవరు ? అట్టి వాటిని జరిగించుటకు సరిపడినంత వయసు గలవారు, విచక్షణా జ్ఞానము గలవారు; పిన్నలు కాదు గాని పెద్దలు.

మత్తయి 18:1-5లో యేసుప్రభువు, "మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని చెప్పెను". బిడ్డలు జన్మ పాపముతో జన్మించిన వారైతే, ఆయన శిష్యులు గాని, మరింకెవరైనా గాని బిడ్డల వంటివారు కావలెనని ఆయన చెప్పియుండక పోను.

## సువార్త పాపులకే

మనస్సాక్షి గలవారికి, విచక్షణ నెరిగిన వారికి, దేవునికి బాధ్యులైన వారికి పాపులకు సువార్తలోని రక్షణ షరతులు ఉద్దేశింపబడినవి. వారుపాపులు గనుక రక్షణ వారికి అవుసరమై యున్నది. అపొస్తలులు సర్వజనాంగములకు సువార్త బోధించవలెనని (మత్తయి 28:19), వారు దేవుని వాక్యమును విని గ్రహించుకొన వలెనని (రోమా 10:17), దేవుని యందును, క్రీస్తునందును విశ్వసించవలెనని (హెబ్రీ 11:6; యోహాను 14:1-3), తమ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెనని (అపొ.కా. 17:30), యేసే దేవుని కుమారుడని తమ నోటితో

ఒప్పుకొనవలెనని (రోమా 10:10; మత్తయి 10:32,33). తమ పాపములు కడిగి వేసుకొను నిమిత్తము నీటిలో ముంచడము పొందవలెనని (అపో.కా. 2:38; 22:16) యేసు ఆజ్ఞాపించెను. ఈ బోధలు, ఆజ్ఞలు పసిపిల్లలనుద్దేశించినవి కావు. సరిగదా వినడానికి, విశ్వసించడానికి, మారుమనస్సు పొందడానికి, ఒప్పుకొనడానికి, బాప్తిస్మము పొందడానికి యుక్త వయసు గలవారిని ఉద్దేశించినవి.

## పాప ఫలితం మరణం

కొన్ని రోగములు వారసత్వము వలన సంక్రమించు చున్నట్లు పాపము కూడా వారసత్వము వలన సంక్రమించునను బోధ బైబిలుకు వ్యతిరేకమైనది. మానవుడు పాపము చేయగా మానవజాతికంతటికీ దాని ఫలితము సంక్రమించెననుట వాస్తవమే. అయితే అమాయకపు పసికందులు ఆదాము హవ్వల పాపపు అపరాధముతో జన్మించుదురనుట పచ్చి అబద్ధము. ప్రతివాడు యుక్త వయస్సు వచ్చిన తరువాత చెడుగును చేసినప్పుడు పాపియగును. అతడు పాపమును గూర్చిన మనస్సాక్షిని కలిగినవాడు గనుక రక్షణ అతనికి అవుసరం. పాపము వలన పర్యవసానములనేకములను స్త్రీ పురుషులు ఎదుర్కొనవలసినదే. చివరిగా భౌతిక మరణం పాప ఫలితమే.

ఆదాము హవ్వలు, అటు తరువాత ఉద్భవించిన మానవులందరు వారి వారి పాపములను గూర్చియే లెక్క చెప్పవలసి యుండును గాని యితరుల పాపమును గూర్చి కాదు. మనము యేసుప్రభువును ఆయన వాక్యమును నిరాకరించిన యెడల అంత్య దినమందు మనకు తీర్పు తీర్చువాడొకడు కలడు. అది ఆయన వాక్యమే (యోహాను 12:48). ఆ ఆఖరి తీర్పులో కూడా ప్రతివాడు మరొకని పాపముల కొరకు కాదు గాని తన పాపములకే దేవునికి జవాబు చెప్పవలసి యున్నది. "తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి... వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పుపొందెను" (ప్రకటన 20:12,13).

- జె.సి. ఛోట్.

(20.)

# చెడ్డ సమరయ స్త్రీ

## (The Bad Samaritan Woman)

సమరయలోని సుఖారను ఊరికి సుమారు అర్థమైలు దూరములో యాకోబు బావి యుండెను. యూదయనుండి గలిలయకు వెళ్ళునపుడు యూదులు సమరయను చుట్టి వెళ్ళుట వాడుక. కాని ప్రభువైన యేసు సమరయ గుండా ప్రయాణించి అలసినవాడై ఆ బావియొద్ద కూర్చుండి సేద తీర్చుకొనుచుండెను. ఆయన దేవుని కుమారుడైనప్పటికిని దైవమానవుడు గనుక మనందరివలె ఆయన ఆకలిగొనెను, దప్పిగొనెను, ఏడ్చెను. మన అందరివలె ఆయన అన్ని బాధలు, శ్రమలయందు శోధనలయందు కూడా సహానుభవము గలవాడై యుండెను (హెబ్రీ 4:15,16).

యేసు ఆ బావి యొద్ద కూర్చుండినప్పుడు శిష్యులు ఆహారము కొనుటకు పట్టణములోనికి వెళ్ళిరి. పాపియైనటు వంటి సమరయ స్త్రీ యొకతి ఆ బావి యొద్దకు నీళ్ళు చేదుకొనుటకు రాగా ప్రభువు ఆమెతో మాట్లాడుచుండెను. ఈ సంభాషణ ఆమెకు మాత్రమే గాక అనేకులు రక్షింపబడుటకు అవకాశము కలిగెను.

### సమరయ స్త్రీ యెడలను, పాపులందరి యెడలను క్రీస్తు యొక్క ధృక్పదము

1. ఈ సమయమందు ఆ స్త్రీకి ఐదుగురు భర్తలు గలరు కాని అప్పటికి తన భర్త కాని వానితో ఆమె జీవిస్తూ యున్నది. అందునుబట్టి ఆమె చాల అసభ్యకరమైన జీవితమును జీవించుచున్నది. ఇది సర్వము ఎరిగిన ప్రభువుకు తెలుసు. ఆయన ఆ స్త్రీ జీవితమును బట్టి అసహ్యించుకొని ఆమెను తృణీకరించ లేదు. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను (1తిమోతి 1:15). [illegible] వచ్చిన స్త్రీ రక్షింపబడవలసి యున్నది. రోగులకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కరలేదు; మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదు (లూకా 5:31,32).

2. తామే నీతిమంతులమని తలంచే స్వనీతిపరులైన పరిసయ్యులు వ్యభిచారమందు పట్టుబడిన యొక స్త్రీని ప్రభువు దగ్గరకు తీసికొని వచ్చినపుడు ఆయన దృక్పథం వేరుగా యుంది (యోహాను 8:3-11). ఆయన మీద నేరము మోపవలెనని ఆయనను నిందించుచు ఈ స్త్రీని గూర్చి నీవేమి చెప్పుదువని అడిగిన వారిని చూచి, మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయ వచ్చునని చెప్పెను. ఆయన ఆ స్త్రీని విసర్జించలేదు. ఆమెతో కఠినముగా కూడ మాట్లాడలేదు. కాని నీవు వెళ్లి యిక పాపము చేయకుమని చెప్పెను. ఆమెను ప్రభువు దగ్గరకు తీసికొని వచ్చినవారు కూడ పాపులే. అయితే వారు పాపులమని తలంచలేదు. వారిలో స్వనీతి యున్నది. ఎదుటివారు నశించుపోవుచుంటే యే విధమైన బాధ్యత వారికి లేదు. ఇటువంటి పరిసయ్యులు ప్రస్తుతం మనలో కూడ యున్నారు.

## వ్యక్తిగతమైన సేవా పరిచర్య చేయుటలో ప్రభువు చూపిన మాదిరి

1. ప్రతివ్యక్తి రక్షింపబడవలసి యున్నదని ప్రభువుకు తెలుసు. ఈ సమరయ స్త్రీతో మాట్లాడుట చూచినవారు ఆయనను నిందించుదురేమో యనే సందేహము ఆయనకు కలుగలేదు. ఆమెతో మాట్లాడిన ఆయనకు కలిగే ప్రయోజనము కూడ లేదు.

2. ఆయనకు దొరికిన ప్రతి తరుణమును ఆత్మలను రక్షించుటకు సద్వినియోగము చేసికొనెను.

3. దాహమున కిమ్మని ఆ స్త్రీని అడుగుటలో ఆయన తన్ను తాను ఎంతో తగ్గించుకొనెను. ఇది వారి సంభాషణకు దారితీసినది ఆమె యొక్క అప్పటి అత్యవసరమును ఆయన అదనుగ తీసికొనెను.

4. అప్పుడు ఆమెకు సువార్తను గూర్చి తెలియజెప్పుటకు ప్రారంభించెను. మరి యెన్నటికిని దప్పిగొననటువంటి నీళ్ళు నీకు కావలెనా ? అని ఆమెనడిగి ఆమె ఆశను జనింపజేసెను. ఈ విధముగ సువార్తను ప్రదర్శించు విధానమును

మనలో అనేకులు నిర్లక్ష్యము చేయుచున్నారు. ఆ జీవజలమును గూర్చి ప్రభువు ప్రస్తావించినపుడు ఆమెలో, ఆశలు చెలరేగెను. ఈ బావి లోతైనది. చేదుకొనుటకు కష్టము. కనుక యింత దూరము రానక్కర లేకుండగను, యింత లోతు నీళ్ళు చేదుకొననవసరము లేకుండగను ఆ జీవజలము నాకీయుమని ప్రభువును అడిగింది.

5. పాపము -రక్షణ అను అంశములను బట్టి ఆ స్త్రీకి చెప్పబడింది. ఆమె పాపియనియు, తన పాపములనుండి విడుదల పొంది రక్షింపబడ వలెననియు కుతూహలము ఆమెలో కలుగునట్లు ప్రభువు చేసెను. రక్షింపబడుటకు పూర్వము నాల్గు విషయములను గూర్చిన ఆలోచన ప్రతివ్యక్తికి ఉండవలెను. 1) నేను పాపిని అని గ్రహింపు యుండాలి. 2) అప్పుడున్న స్థితిలో మరణించినచో పరలోకము చేరలేననే గ్రహింపు 3) పాపములనుండి పరిహారము పొందుటకు తానేమి చేయవలెను. 4) ఇదే అనేకూల సమయం గనుక సరియైన నిర్ణయమును తీసికొన వలెను.

6. ప్రభువు బోధకు మంచి ఫలితము కలిగింది. సమరయ స్త్రీ ఒక్కతె మాత్రమే రక్షింపబడలేదు గాని యింకను అనేకులు రక్షణ మార్గములోనికి వచ్చునట్లు చేయగలిగింది.

7. ఇది ప్రభువు శిష్యులకు ఒక గొప్ప గుణపాఠముగ యున్నది. తరుణము లీయబడినపుడు వాటిని సద్వినియోగము చేసికొనుట. ఇదిగో. మీ కన్నులెత్తి పొలములను చూడుడి. అవి యిప్పుడే కోతకు సిద్ధముగ యున్నవి. విత్తువాడును కోయువాడును కూడ సంతోషించునట్లు కోయువాడు జీతము పుచ్చుకొని నిత్యజీవార్థమైన ఫలము సమకూర్చుకొనుచున్నాడు. (యోహాను 4:35, 36). మీరు మీ కన్నులు విప్పినేను చేసిన రీతిని మీకును ఈయబడే తరుణములను సద్వినియోగము చేసుకొనుడని ప్రభువు శిష్యులతో చెప్పెను. ఈ జీవజలము యొక్క ఆవశ్యకత ఎంతో మందికి ఉన్నది.

(23)

# వ్యక్తిని మార్చగలిగే దేవుని శక్తిగల మాట

సమరయ స్త్రీ చాల చెడు జీవితములో యున్నను ప్రభువు చెప్పే మాటలు వినుటకు ఆమె ఆసక్తిని కనుబరచింది. క్రీస్తు ప్రభువును రక్షకునిగ నిరాకరించిన అనేకమంది కంటె ఈ స్త్రీ యొక్క హృదయము ప్రభువు మాటల యెడల ఎంతో ఆసక్తిని కనుబరచింది. తన నిజస్థితిని గూర్చి తాను యేమి ఆలోచన లేకుండా యుండినదో దానికొరకు ఆమె ఆశించునట్లు ప్రభువు మాటలున్నవి. వ్యభిచారియైన స్త్రీ రక్షింపబడి అనేకుల రక్షణకు కారకురాలయ్యినది. ఈ దినములలో అనేకులు పాపమునకు దాసులై దానిచే ఈడ్వబడుచుండగా వారుయెన్నడు ఊహించని రీతిగా వారికి విమోచనము కలిగించేది క్రీస్తు సువార్త మాత్రమే. మార్చబడిన సమరయ స్త్రీ తాను పొందిన జీవజలమును గూర్చి అనేకులకు తెలియపరచుట కెంతో ఆశించినది. ఆత్రుత కలిగియుండి తన కుండను కూడ బావి యొద్ద విడిచి వెళ్ళి ఆ ఊరిలోని అనేకులను ప్రభువు దగ్గరకు తీసికొని వచ్చినది. నిజముగ రక్షింపబడినవారు ఊరకనే నెమ్మదిగ యుండలేరు. ఈస్త్రీ చెప్పిన మాటలను బట్టి అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి. ఆయన మాటలు వినినవారు కూడ అనేకులు స్త్రీని బట్టికాక ఆయనమాటలను బట్టియే ఆయన యందు విశ్వాసముంచిరి. తమయొద్ద ఉండుమని సమరయులు ఆయనను వేడుకొనుటను బట్టి రెండు దినములుండెను. అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి ఇకమీదట నీవు చెప్పిన మాటను బట్టికాక, మా మట్టుకు మేము విని, ఈయన నిజముగా లోక రక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి (యోహాను 4:39-42). తన పాత జీవితము ఎంత ఘోరమైనదైనప్పటికిని యేసు ప్రభువును రక్షకునిగ అంగీకరించిన తరువాత ఆ వ్యక్తి అనేకుల రక్షణకు కారకుడౌతాడు.

1. దేవుని యెడల తృష్ణ, ఆసక్తి-వీటికి సాదృశ్యముగ సమరయ స్త్రీ గలదు. మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును (మత్తయి 4:4). మానవునకు శరీరావసరతలు తీరుట

ఎంత అవసరమో దేవుని యెడల తృష్ణ తీర్చుకొనుటయు అంతే అవసరము. కనుకనే దావీదు మహారాజు నా ప్రాణము దేవుని కొరకు తృష్ణగొనుచున్నది. జీవము గల దేవునికొరకు తృష్ణ గొను చున్నది (కీర్తనలు 42:2) అని అంటున్నాడు. నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు; నేను వాని కిచ్చు నీళ్ళు జీవనమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా యుండును (యోహాను 4:14) అని మన ప్రభువైన యేసు చెప్పుచున్నారు. ఈ జీవ జలమును ఒకడు ఎట్లు సంపాదించగలడు ? నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు. వారు తృప్తి పరచబడుదురు (మత్తయి 5:6).

ఆత్మతోను, సత్యముతోను ఆరాధించుటను గూర్చి ప్రభువు ఈ స్త్రీకి బోధించెను. మిక్కిలి ప్రాముఖ్య మైన బోధను ప్రభువైన క్రీస్తు జనసమూహములకు గాక ఒక్క వ్యక్తికి బోధించెను. ఈ సమరయ స్త్రీ ఎంత పాపి యైనప్పటికిని సత్యముతో దేవుని ఆరాధించుటను ఆమెకు బోధించెను. దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను (యోహాను 4:24). 1. ఆత్మతో ఆరాధించుట:- దేవుడు ఆత్మ, మానవుడు ఆ గొప్ప ఆత్మచే సృష్టించబడిన ఆత్మ. ఆరాధన యనేది మానవుని ఆత్మకును, దానిని సృష్టించిన సృష్టి కర్తకును గల సంబంధము.

2.సత్యముతో ఆరాధించుట:- దేవుని ఆరాధించుట ఆత్మతోను, సత్యము తోను యుండవలెను. సత్యముతో ఆరాధించుట యనగా దేవుని వాక్యాను సారముగ యుండవలెను(యోహాను 17:17). ఏదో ఒక రకమైన ఆరాధన సరిపోదు. కయీను దేవుడు చెప్పిన రీతినిగాక తన స్వంత యిష్టప్రకారము ఆరాధించుటకు ప్రయత్నించాడు, అతనిఆరాధనను దేవుడు నిరాకరించాడు. దేవుని ఆరాధించు టకు హృదయములో ఆశయుండిన ఆయన ఆజ్ఞలన్నిటిని మనము గైకొనేవారముగ యుంటాము. అనగా ఆయన చెప్పినట్లు చేస్తాము.

\- లోటీ బెత్ హాబ్స్

చక్కటి భోజన పానాదులనేర్పాటు చేసిరి. ముగింపు ప్రార్థన అనంతరం సువార్తికులు తమ తమ గ్రామములకు ఆనందోత్సాహములతో తిరిగి వెళ్లిరి.

1998 డిశంబరు నెల సువార్తికుల సదస్సు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, సంజీవయ్య నగరులో, 30వ తేదీ బుధవారం నాడు అత్యంత ఘనముగా జరిగెను. కొన్ని వారముల క్రితమే క్రీస్తు సంఘములోనికి చేర్చబడిన సోదరులు గొల్ల రాజారావ్ గారి ఆధ్వర్యమున ఈ సదస్సు నిర్వహించబడెను. ఉభయగోదావరి జిల్లాలనుండి అనేక మంది సువార్తికులు సకాలమునకు కూడి రాగా "నేడు అమలులో యున్న చట్టము యేది ? క్రైస్తవులు పాతనిబంధనకు బద్ధులై యున్నారా ?" అను అంశము సవిస్తరముగా చర్చింపబడెను.

సోదరులు జి.షద్రక్, యన్.మోజెస్ గార్లు పాటలు నడిపించగా, డి.రంగారావ్ (గొల్లవిల్లి) గారి ప్రార్థనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు యు.స్టాలిన్ (గుత్తినదీవి), యన్.మోజెస్ (కరుగోరుమిల్లి), జి.షద్రక్ (పాలకొల్లు), పి.జె.కృపాలిని (పలివెల), పి.సామ్యూల్ (ఆచంట), వి.చిన్నయ్య (కడలి), డి.ఇశ్రాయేలురాజు (కొండుకుదురు), గొల్లరాజరావ్ (భీమవరం), మరియు జాషువా గూటం గార్లు పై అంశమును సవిస్తరముగా చర్చించిరి.

దేవుడు తన ప్రజలతో రెండు నిబంధనలు చేసెను. మొదటిది పాతనిబంధన, రెండవది క్రొత్తనిబంధన. అయితే పాత నిబంధనను దేవుడు మానవులందరితో గాక మోషే ద్వారా ఇశ్రాయేలీయులతో చేసెను. "మోషే ఇశ్రాయేలీయులనందరిని పిలిపించి ఇట్లనెను- ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని వాటిననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమై యున్న మనతోనే యీ నిబంధన చేసెను" (ద్వితీ 5:1,2). గనుక పాతనిబంధన ఇశ్రాయేలీయులకే గాని మరెవరికిని వర్తించదు. సరిగదా అది ఇశ్రాయేలీయులకును, అన్యులకును మధ్య ఒక గోడగా యుండి, వారిద్దరి మధ్య ద్వేషమునకు కారణమాయెను.

ఇట్లుండగా యేసుక్రీస్తు యూదులకును, యూదులు కానివారికిని మధ్య ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్య గోడను పడగొట్టి వారి ఉభయులను తన శరీరమందు (అనగా సంఘమందు) ఏకము చేసెను (ఎఫెసీ 2:11-18). మోషే ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగజేయలేదు. అది బలహీనమైనది. నిష్ప్రయోజనమైనది గనుక నివారణ చేయబడెను (హెబ్రీ 7:18-19). "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహాను 1:17) "ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుట యందు నిలకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు.. ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని

ఎదుట నీతిమంతుడని తీర్పబడడను సంగతి స్పష్టమే" (గలతీ 3:10-11). "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్పబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు. కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4). "ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకాశముండ నేరదు" (హెబ్రీ 8:7). "ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" (హెబ్రీ 8:13). అంత్యదినమందు దేవుడు యేసుక్రీస్తు ద్వారా, ఆయన మాటలను బట్టియే మనకు తీర్పుతీర్చును (యోహాను 12:48) గనుక నేడు మానవులందరు పాతనిబంధనకు గాక క్రొత్తనిబంధనకు బద్ధులై యున్నారు.

సదస్సు అనంతరము 9మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు గొల్లరాజారావ్ గారు, సంజీవయ్య నగరులో క్రీస్తు సంఘము సదస్సు కొరకు మంచి ఏర్పాట్లు చేసి, చక్కటి భోజన పానాదుల నేర్పరచి, వచ్చిన వారందరినీ సత్కరించిరి. సోదరులు వై.ప్రభుదాస్ (కొమ్మర) గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను. 1998వ సంవత్సరమంతయు దేవుడు వారికి తోడుగా వున్నందుకు సోదరులు దేవునికి స్తుతులు చెల్లించిరి. ఒకరికొకరు రాబోవు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకొనిరి.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications, Kakinada - 533 004

PRINTED BOOK - BOOK POST

From:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To